

తగ్గిన ధరల పట్టికను ప్రదర్శించాలి

శ్రీకాకుళం సిటీ : జిఎస్‌టి 2.0 సంస్కరణల కారణంగా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే మందులు, వైద్య పరికరాలు, అత్యవసర మందుల ధరలు తగ్గాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. 12 శాతం నుంచి 5 శాతానికి జిఎస్‌టి శ్లాబ్ తగ్గడం, కొన్నింటిపై పూర్తిగా తగ్గించడంతో ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గనున్నాయని పేర్కొన్నారు. చిన్నారులకు ఉపయోగించే నాప్‌కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిల్స్, వ్యక్తిగత ఆరోగ్య బీమాపై జిఎస్‌టి తగ్గించినట్లు వివరించారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై అన్ని పిహెచ్‌సిలు, ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, పోలీ క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్లు, లేబొరేటరీల్లో తగ్గిన ధరల పట్టికను రిసెప్షన్‌లో ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేశారు. తగ్గిన ధరల రేట్ల పట్టికను ప్రదర్శించని, నియమ నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కూటమి పార్టీల్లో మరో చిచ్చు రగిలింది. ఇటీవల పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సహా టిడిపి ఎమ్మెల్యేలంతా దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఇది రెండు పార్టీల మధ్య మంటలు రేపుతున్న సమయంలోనే తాజాగా ఎమ్మెల్సీ, జనసేన నాయకులు నాగబాబు పర్యటన దానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. టిడిపి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాకుళం నియోజకవర్గ కేంద్రంలో ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను పరిశీలించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే గొండు శంకర్ నియోజకవర్గంలో లేని సమయంలో పర్యటనకు వచ్చి హడావుడి చేయడంపై టిడిపి శ్రేణులు భగ్గుమంటున్నాయి.

కూటమిలో మరో చిచ్చు

- ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్సీ నాగబాబు
- కాంప్లెక్స్ మునకపై సుడా, ఆర్‌టిసి అధికారులకు ఆదేశాలు
- స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ లేని సమయంలో పర్యటన
- భగ్గుమంటున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ నాగబాబు ఆకస్మిక పర్యటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కర్నూలులో నిర్వహిస్తున్న ప్రధాని సభకు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలంతా తరలి వెళ్తే ఎమ్మెల్సీ నాగబాబు మాత్రం శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ పర్యటనకు రావడం కొంత చర్చకు దారితీసింది. శ్రీకాకుళం నగరంలో రెండు నెలల కిందట జనసేన నేతలతో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని అనేక సమస్యలతో పాటు ఆర్‌టిసి కాంప్లెక్స్ సమస్యపై ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. వర్షాలు వస్తే కాంప్లెక్స్ నీట మునిగిపోతుందని, ఎవరూ సమస్యను పరిష్కరించడం లేదని జనసేన నాయకులు నాగబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఆ నేపథ్యంలోనే గురువారం కాంప్లెక్స్‌ను పరిశీలించడానికి వచ్చారని జనసేన నాయకులు చెప్తున్నారు. ఎమ్మెల్సీ నాగబాబు పర్యటనపై ఈనెల 15న ఉదయం జనసేన నాయకులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. నాగబాబు పర్యటనలో పాల్గొనాలని జనసేన నాయకులతో పాటు సుడా అధికారులు, చైర్మన్ కొరికాన రవికుమార్‌కూ సమాచారం ఇచ్చారు. సుడా, ఆర్‌టిసి అధికారులతో కలిసి గురువారం ఆయన ఆర్‌టిసి కాంప్లెక్సులో పర్యటించారు. కాంప్లెక్సు మునిగిపోవడానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకుని, అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

భగ్గుమన్న టిడిపి శ్రేణులు

సాధారణంగా ఒక నియోజకవర్గంలో అదే పార్టీ లేదా భాగస్వామ్యపక్ష పార్టీలకు చెందిన ముఖ్య నేతలు పర్యటించే సందర్భంలో, ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేకు కచ్చితంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సమాచారమిచ్చే విషయంలోనూ వివక్ష చూపినట్లు తెలిసింది. జనసేన శ్రేణులకు 15న ఉదయం సమాచారం ఇవ్వగా, ఎమ్మెల్యే శంకర్‌కు రాత్రి 11 గంటల ప్రాంతంలో నాగబాబు పర్యటనకు సంబంధించిన సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అప్పటికే ఎమ్మెల్యే ప్రధాని కర్నూలు సభకు పయనమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో లేనప్పుడు ఆ పర్యటను రద్దు చేసుకోవాల్సింది పోయి పనిగట్టుకుని ఆర్‌టిసి కాంప్లెక్సు చూడడానికి రావడంపై టిడిపి శ్రేణులు మండిపడుతున్నాయి. ఇప్పటికే తమ నేత పలు పర్యాయాలు ఆర్‌టిసి కాంప్లెక్సును స్వయంగా పరిశీలించి జనం ఇబ్బందులను తెలుసుకున్నారని, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్న తరుణంలో నాగబాబు వచ్చి కొత్తగా చేయడానికి ఏముంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఏదైనా సమస్య తలెత్తితే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలి తప్ప ఇలా నేరుగా పర్యటనల పేరుతో హడావుడి చేయడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

కూటమిలో విభేదాలకు ఆజ్యం

ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన టిడిపి కూటమి ప్రభుత్వంలో విభేదాలకు ఆజ్యం పోసినట్లయింది. ఆర్‌టిసి కాంప్లెక్సు సమస్యపై జనసేన నాయకులు ఫిర్యాదు చేసిన సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నించవచ్చు. తాను డిప్యూటీ సిఎం సోదరుడు, ఎమ్మెల్సీననే హోదా అడ్డు వస్తే కలెక్టర్‌కు లేఖ రాసి కూడా పరిష్కారం చేయొచ్చు. ఇక్కడ పరిష్కారం కాదనుకుంటే స్వయంగా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి కూడా ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపించవచ్చు. అలా కాకుండా వేరే ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో స్వయంగా జనసేన రాష్ట్ర నేత పర్యటించడాన్ని టిడిపి శ్రేణులు తప్పుపడుతున్నాయి.



పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

హాస్టళ్లలో మౌలిక వసతులు కరువు

- విద్యార్థుల సమస్యలు జిల్లా మంత్రులకు పట్టదా?
- పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- సంక్షేమ హాస్టళ్లు పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

హాస్టళ్లలో మౌలిక వసతులు లేక విద్యార్థులు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టళ్లలో సిపిఎం ప్రతినిధి బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ప్రతినిధి బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 31 ఎస్‌సి, 78 బిసి, 60 ఎస్‌టి హాస్టళ్లు ఉన్నాయని, వీటిల్లో కనీస వసతులు లేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించని వారు జిల్లాలో విమానాశ్రయాలు నిర్మిస్తామని చెప్తున్నారని ఎద్దేవా చేశారు. హాస్టళ్లలో డ్రైనేజ్ వ్యవస్థ లేక మురికికూపాల్లో దోమలతో విద్యార్థులు సాహవాసం చేస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న మెనూ ఛార్జీలు డిగ్రీ విద్యార్థులకు రోజుకి రూ.53, టెన్త్ క్లాస్ లోపు విద్యార్థులకు రూ.40 ఇస్తుందని ఇంత తక్కువ మెనూ ఛార్జీల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించకపోవడంతో సరైన నిర్వహణ లేదన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు జిల్లా మంత్రులకు పట్టదా అని ప్రశ్నించారు. వర్షం పడితే ఎస్‌సి హాస్టల్ మొత్తం నీటితో నిండిపోతుందని, ఎస్‌టి హాస్టల్‌కి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో హాస్టల్ సరిపడక విద్యార్థులు జాగారం చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టి హాస్టల్‌లో విద్యార్థులకు రూములు లేవన్నారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక్కో హాల్ ఉన్నాయని, అందులోనే 200 మంది విద్యార్థులు నిద్రించడం, భోజనం చేయడం, చదువుకోవడమైతే వారి చదువు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎప్పుడూ సంక్షేమమని గొప్పలు చెప్పుకోవడం తప్ప హాస్టల్ విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సంక్షేమ హాస్టల్‌లో సంక్షేమం కొరవడిందని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, మురికి కూపాలు లేకుండా నీరు పారే విధంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మంచినీరు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ప్రతినిధి బృందం సభ్యులు ఎం.గోవర్ధనరావు, పి.సుధాకర్, కె.సూరయ్య, ఎల్.మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మూలపేట నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలో మూలపేట పోర్టు నిర్మాణం వల్ల నిర్వాసితులైన గ్రామస్తులకు పునరావాస కాలనీలో ప్లాట్లను కేటాయించారు. టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి నౌపడ వద్ద నిర్వాసితులకు లాటరీ పద్ధతిలో గురువారం ప్లాట్లు కేటాయించారు. మూలపేట, విష్ణుచక్రం రెండు గ్రామాలను కలిపి మొత్తం 594 పిడిఎఫ్‌లుగా గుర్తించారు. విష్ణుచక్రం గ్రామ నిర్వాసితులకు ఇప్పటికే ప్లాట్ల కేటాయింపు జరిగి నిర్మాణాలు కొనసాగుతున్నాయి. తాజా లాటరీలో మూలపేటకు చెందిన మిగిలిన 511 పిడిఎఫ్‌లకు ప్లాట్లు కేటాయించారు. బంధువులు, కులాల వారీగా 91 క్లస్టర్లుగా విభజించి, ప్రతి కుటుంబానికి లాటరీ ద్వారా కేటాయించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ, కేటాయించిన ప్లాట్లలో త్వరలోనే నిర్మాణాలు చేపట్టాలన్నారు. స్థల కేటాయింపు పత్రాలను త్వరలో అందజేస్తామని తెలిపారు. అంతకుముందు నిర్వాసితులు గుడి, పాఠశాల, వీధి రోడ్లు, నీటి సదుపాయం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిగా ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా పెండింగులో ఉన్న 14 పిడిఎఫ్‌ల్లో ఆరు ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు రూ.ఐదు లక్షలు చొప్పున అందజేసేందుకు అధికారులు అంగీకరించారు. మిగిలిన వారికి రెండు సెంట్లు చొప్పున స్థలాల కేటాయింపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భూమి లేని నిర్వాసితులకు ఆర్థికసాయం కల్పించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తానని ఆర్‌డిఒ హామీనిచ్చారు. ప్రస్తుతం ఉన్న ఇళ్ల విలువను గత అంచనాల కంటే 20 శాతం పెంచాలని నిర్వాసితులు కోరగా, కనీసం 10 శాతం పెంపునకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందర్, సర్పంచ్ బాబురావు, టెక్కలి సిఐ శ్రీనివాసరావు, నౌపడ, సంతబొమ్మాళి ఎస్‌ఐలు నారాయణస్వామి, సింహాచలం, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి అధికారులు, గ్రామస్తులు భీమారావు, నారంనాయుడు, రాంబాబు పాల్గొన్నారు.



ప్లాట్లను కేటాయిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల ఎంపిపిపై పీడీ యాక్టు

- విశాఖ సెంట్రల్ జైలుకు తరలింపు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు
- ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

చట్టాలను ఉల్లంఘిస్తూ, ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్నారన్న అభియోగాలపై ఎచ్చెర్ల ఎంపిపి, వైసిపి నాయకులు మొదలవలస చిరంజీవిపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వివరాలను వెల్లడించారు. పీడీ యాక్టుకు కలెక్టర్ ఆమోదంతో తెలపడంతో ఆయన్ను అరెస్టు చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. చిరంజీవిపై 1999లో మొదటి కేసు నమోదు కాగా, ఈ ఏడాది జూన్ పదో తేదీన 14వ కేసు నమోదైందన్నారు. గత రెండేళ్లలో వరుస కేసులు నమోదయ్యాయని తెలిపారు. పలు కేసుల్లో పలుమార్లు ఆయన అరెస్టయ్యారని చెప్పారు. ఆయనపై ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందన్నారు. భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించడం, హత్య, హత్యాయత్నం వంటి క్రిమినల్ కేసులు ఆయనపై ఉన్నాయన్నారు. ఆయన ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతుండడంతో ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఆయనపై పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. ఫరీదుపేటలో 33 మంది క్రైమ్ సస్పెక్ట్‌లు ఉన్నారని, వీరిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. హత్య కేసులో బెయిల్‌పై ఉన్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. పీడీ యాక్టుల నమోదు, జిల్లా బహిష్కరణ వంటి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చైన్ స్నాచింగ్, మాదకద్రవ్యాల రవాణా, భూదురాక్రమణలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. నిందితుల ప్రవర్తనను ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సెటిల్‌మెంట్ల కోసం రౌడీషీటర్లు, చట్టాన్ని ఉల్లంఘించే వారి వద్దకు వెళ్లి సమస్యలను కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. జిల్లాలో నేర నియంత్రణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పరిశుభ్రత పాటించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వృద్ధాశ్రమాల్లో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగరంలోని శాంతాకళ్యాణ్ అనురాగ నిలయాన్ని గురువారం సందర్శించారు. రేషన్ నాణ్యతను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేసే సిబ్బంది వివరాలను అడిగారు. వృద్ధుల గదిని పరిశీలించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. గదిలో ఒకటే టివి ఉండగా, మిగిలినవి ఎందుకు పెట్టలేదని సిబ్బందిని ప్రశ్నించారు. టివిలు ఉన్నాయని పెట్టాల్సి ఉందని సిబ్బంది బదులిచ్చారు. అక్కడ ఉన్న హాస్పిటల్ వార్డును సందర్శించారు. మరమ్మతులకు అవసరమైతే నిధులు మంజూరు చేస్తామన్నారు. పిల్లల గదిని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. లైట్లు వెలగడం లేదని సిబ్బంది చెప్పగా, వెంటనే ఎలక్ట్రికల్ ఎఇకి ఫోన్ చేసి సాయంత్రం నాటికి లైట్లు వెలగాలని ఆదేశించారు. అనురాగ నిలయంలో ఆహ్లాదకర వాతావరణం ఉండాలన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆధునికీకరణకు కృషి

ఎమ్మెల్సీ నాగబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ, జనసేన నాయకులు కొణిదెల నాగబాబు అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను గురువారం ఆయన పరిశీలించారు. చిన్న వర్షం కురిసినా కాంప్లెక్స్‌లో నీరు నిలిచిపోతుందని, మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని జనసేన నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాంప్లెక్స్ మొత్తం తిరిగి పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. భవిష్యత్‌లో మోడల్ కాంప్లెక్స్‌లగా తీర్చిదిద్దే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవికుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, నాయకులు విశ్వక్సేన్, రామ్మోహనరావు, గేదెల చైతన్య, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న నాగబాబు

ఎమ్మెల్సీని కలిసిన కలెక్టర్, ఎస్‌పి

జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ నాగబాబును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆర్అండ్‌బి బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. జిల్లా పరిస్థితులను వివరించారు.

నేడు స్వాభిమాన్ గ్రీవెన్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్‌ను శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు వికలాంగ సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రీవెన్స్‌కు పలు శాఖల ఉన్నతాధికారులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రారంభ దశలోనే పిల్లలను అనారోగ్యం నుంచి కాపాడుకోవాలని, వైకల్యాలను తొలి దశలోనే గుర్తించి తగిన సేవలు అందిస్తే నివారణ సులభమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక రిమ్స్ ఆస్పత్రిలో డిఐఇసి మానసిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. పుట్టుక నుంచి ఆరేళ్ల వరకు మానసిక అభివృద్ధి ఆలస్యం, వైకల్యం ప్రమాదం ఉన్న పిల్లలకు సమగ్రమైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆరోగ్య పరీక్షల సమయంలోనే సమస్యలను గుర్తించాలన్నారు. తలసేమియా వంటి వ్యాధులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన సేవలు అందించాలన్నారు. తనిఖీలో డాక్టర్ ఎన్.చైతన్య, డిఐఇసి నిర్వాహకులు అప్పలనాయుడు, ఇతర వైద్య నిపుణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిబాబు

క్షతగాత్రులకు పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలోని భవానీపురం వీధిలో బుధవారం రాత్రి నందెన్న నిమజ్జన కార్యక్రమానికి డిజె సౌండ్ ఏర్పాటు చేశారు. డ్యాన్సులు వేసే సమయంలో డిజె అధిక శబ్దానికి భవనం పోర్టికో గోడ కూలింది. ఈ సమయంలో ఉత్సాహంలో పాల్గొన్న ఏడుగురు తీవ్ర గాయాలయ్యాయి. బండి సంతోష్ ,బండి పూర్ణ, బాలకృష్ణ, పన్నీరు చిరంజీవి, రాధ, సోనియా, అమృత గాయపడ్డాడరు. ఇందులో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన క్షతగాత్రులు నరసన్నపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను గురువారం పరామర్శించారు. అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అలాగే సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటన స్థలాన్ని టెక్కలి డిఎస్‌పి లక్ష్మణరావు, తహశీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఆఇ శ్రీనివాసరావు, ఇఒ ద్రాక్షాయిని పాల్గొన్నారు.

209 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు
- ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద బుధవారం వాహనాల తనిఖీలు చేపడుతుండగా, కారులో తరలిస్తున్న 290 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సునీల్, విశాల్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈగల్ టీమ్ సమాచారం మేరకు చిలకపాలెం వద్ద పొందూరు వైపు నుంచి వస్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. డిఎల్ 4సి ఎన్ఇ 8246 నంబరు గల కారును పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా వెళ్లిపోవడంతో వెంబడించి పట్టుకున్నారు. కారులో ఉన్న సునీల్, విశాల్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, గంజాయి రవాణా చేస్తున్నట్లు అంగీకరించారు. వీరి నుంచి 40 ప్యాకెట్లలో ఉన్న 209 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా లంపటాపుట్‌కు చెందిన సమరమతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు తరలిస్తున్నారు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు ముందు వెళ్తూ పోలీసుల సమాచారాన్ని కారు డ్రైవర్‌కు చెప్తూ డైవర్షన్ రూట్ తెలియజేస్తూ చెక్‌పోస్టులను తప్పిస్తున్నారు. సాలూరు, రామచంద్రాపురం, రాజాం, చిలకపాలెం మీదుగా విజయవాడ, వరంగల్, ఖమ్మం చేరుకుని అక్కడ్నుంచి నాగపూర్ హైవే ద్వారా మీరట్ చేరుకునేందుకు ప్లాన్ వేశారు. పోలీసుల తనిఖీలతో చివరికి వారు పట్టుబడ్డారు. గంజాయిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఈగల్ టీమ్, పోలీసు సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డిఎస్‌పి వివేకానంద, సిఐ అవతారం, ఎస్‌ఐలు సందీప్, చిరంజీవి పాల్గొన్నారు.



గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న రాజశ్రీ

ఆహార గిడ్డంగుల పరిశీలన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని తర్లకోట, కాశీబుగ్గ ఆహార గిడ్డంగులను ఎపి ఆహార గిడ్డంగుల సంస్థ విజయనగరం రీజనల్ మేనేజర్ వై.రాజశ్రీ గురువారం పరిశీలించారు. అంతకముందు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రెండు గిడ్డంగుల్లో ఎన్ని మెట్రిక్ టన్నులు బియ్యం బస్తాలు ఉన్నాయి? గిడ్డంగుల సామర్థ్యం ఎంత? తదితర అంశాలను స్థానిక మేనేజర్ కె.శ్రీనివాసరావుకు అడిగి తెలుసుకున్నారు. రికార్డులకు స్టాక్‌కు, గొడాంలో స్టాక్‌కు సరిపోయిందా? లేదా? అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీజనల్ పరిధిలో విశాఖపట్నం, శ్రీకాకుళం, పాడేరు, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, జిల్లాలో 39 గొదాములు ఉన్నాయని చెప్పారు. ప్రతి మూడు నెలలకొకసారి గొదాములను పరిశీలిస్తుంటామని, అందులో భాగంగా పరిశీలనకు వచ్చామని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కామేశ్వరరావు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

ఈ నెల 18న జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించనున్న చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెకుముకి సైన్సు సంబరాలకు జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థుల్లో తార్కిక ఆలోచన, సృజనాత్మక భావంతో, శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవడానికి ఈ సంబరాలు దోహదపడతాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.లక్ష్మణరావు తయారు చేసిన ఎన్ఎం ఎమ్మెస్ స్టడీ మెటీరియల్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నౌపడ శోభారాణి, మండల కన్వీనర్ కె.శ్రీనివాస్, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్ పాలవలస ధర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిసి రహదారిని పరిశీలిస్తున్న ఎఇ దయాసాగర్

సిసి రహదారి పనులు పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపడుతున్న సిసి రహదారి పనులను గురువారం పంచాయతీరాజ్ ఎఇ దయాసాగర్ పరిశీలించారు. గ్రామంలో రూ.26 లక్షలతో జంగం రచ్చబండ నుంచి చిన్న చెట్టువరకూ సిసి రహదారి, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోజ్, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థినులు

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తాళ్లభద్రలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి కాశీబుగ్గ సెక్టార్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అత్యాచారాలు, నేరాలు మాదక దవ్యాలపై అవగాహన, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పరిశుభ్రత, పోషకాహారం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.గోపీకృష్ణ, ఉపాధ్యాయులు ఎన్.లక్ష్మి, ఎమ్మెస్ కె.సిహెచ్.మనీషా, సూపర్ వైజర్ గంగమ్మ, అంగన్వాడి కార్యకర్తలు తాళబద్ర రమాభాయి, శైలజ, పద్మ, జానకి, జె.ఆర్.సి.పురం కృష్ణవేణి, శాంతినగర్ జి.పుష్పలత, పెంటిభద్ర ఎస్.శాంతి, పద్మనాభపురం అరుణ, కంబుషోలి లలిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పద్మావతి

ఓటర్ల మార్పులు, చేర్పులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బిఎల్ఒలు ఓటరు చేర్పులు, మార్పులపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ప్రలోభాలకు లోనుకావద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఉప కలెక్టర్ బి.పద్మావతి సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నియోజకవర్గ బిఎల్ఒలతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఎల్ఒలు తమ యాప్‌లో ఫారం-6 ఓటర్ల చేర్పులు, ఫారం-7 ఓటర్ల తొలగింపులు, ఫారం- 8 మార్పులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2002 నాటి ఓటర్ల జాబితా డేటా బిఎల్ఒల వద్ద అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దార్లు ఎన్.వెంకటరావు, బి.మురళీమోహనరావు, రమేష్, బి.అప్లపస్వామి, డిటి శ్రీహరి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలో విద్యార్థులకు ఉపయోగపడే ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు వితరణగా జుట్టు సింహాచలం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జుట్టు జగన్న ఛారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యాన జిల్లాలోని పది మండలాల్లో 115 కోచింగ్ సెంటర్లకు అందజేస్తున్నామని తెలిపారు. ఈ పుస్తకాలు చదువుకొని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒలు శాంతారావు, దాలినాయిడు పాల్గొన్నారు.

మందస పంచాయతీలో అన్నీ సమస్యలే

ప్రజాశక్తి- మందస

మందస మండల కేంద్రమైన మందస మేజర్ పంచాయతీ కార్యాలయం అక్రమ వసూళ్లకు అడ్డాగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో ప్రజా సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి మధ్య దళారుల ద్వారా కార్యాలయం యంత్రాంగం వసూళ్లు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కలెక్షన్లపై ఉన్న శ్రద్ధ పాలనలో కనిపించడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో 14 వార్డులు, 15 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఈ పంచాయతీలో మందసతో పాటు చిన్నబరంపురం, మేఘమాల గ్రామాలు ఉన్నాయి. విద్యుత్ బల్బులు పంచాయితీ వినియోగానికి కొనుగోలు చేస్తున్నట్టు తప్పుడు రికార్డులు ఉన్నట్టు ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పారిశుధ్య పనులు పూర్తిగా చేపట్టిన దాఖలాలు లేవు. వీధిలో చెత్తాచెదారం, డ్రైనేజీల్లో నీరు నిల్వతో కంపుకొడుతున్నాయి. జంగిల్ క్లియరెన్స్ పనులు సక్రమంగా నిర్వహించకుండానే



మందస పంచాయతీ కార్యాలయం

ప్రొక్లెయినర్లు పెట్టినట్టు బిల్లులు డ్రా అవుతున్నట్టు ప్రచారం సాగుతుంది. శుద్ధ జలం పంపిణీ చేసే పైప్‌లైన్లు, కుళాయిలు అక్కడక్కడ పాడైపోయాయి. రోజూ ఎక్కడో ఒకచోట రోడ్లపైకి నీరు వృథాగా పోతుంది. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో జరిగే క్రయవిక్రయాలకు సంబంధించిన పొజిషన్ ధ్రువపత్రాల మంజూరు కోసం రూ.పది వేలు అక్రమంగా వసూళ్లు చేసి మంజూరు చేస్తున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. విద్యుత్ మీటరు ఇంటి యజమానికి కావాలంటే రూ.5 వేలు లంచం చెల్లిస్తేనే మంజూరు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరుభూమికి మార్గమేది..?

కవిటి: మేజర్ పంచాయతీ మండల కేంద్రం కవిటి శ్మశాన వాటికకు వెళ్లే రహదారి కోతకు గురై, ముళ్లపొదలు చొచ్చుకువచ్చి అడుగు వేసేందుకు ఆలోచించే పరిస్థితిలో ఉంది. ముఖ్యంగా శ్మశానవాటిక మార్గానికి చేరుకున్న సమయంలో శవం కాసుకోవడం కూడా కష్టంగా మారుతోంది. ఇటీవల ప్రగడపుట్టుగకు చెందిన ఓ మహిళ మృతదేహాన్ని తీసుకువెళ్తున్నప్పుడు కిందపడిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు బెహరా వీధి నుంచి వచ్చే నీరుకూడా అదే మార్గంలోకి చొచ్చుకునివస్తుండడంతో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ఇటువంటి సమస్యల నడుమ కవిటి, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ, గొండ్యాలపుట్టుగ గ్రామాలకు చెందిన ప్రజలు శవ దహనాలకు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కవిటి గ్రామసభలో మాట్లాడిన మాజీ సర్పంచ్ ఆరింగి మధు 431-4 సర్వే నంబరులో 2.99 ఎకరాలు ఉండాల్సిన శ్మశాన వాటిక పూర్తిగా ఆక్రమణలకు గురైందని, తక్షణమే ఆక్రమణలు తొలగించకపోతే శవం కాల్చేందుకు స్థలం కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో శ్మశాన వాటిక రహదారి సమస్య కూడా ప్రస్తావించారు. ఎన్నో పథకాలు,



అధ్వానంగా ఉన్న శ్మశానవాటిక మార్గం

ఇంకెన్నో నిధులు ప్రజల అవసరాలకు కేటాయిస్తున్న ప్రభుత్వం అత్యవసరమైన శ్మశాన వాటిక వ్యవహారంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం తీవ్రమైన విమర్శకు తావిస్తోంది. చిన్న, చిన్న పంచాయతీల్లో కూడా మరుభూమికి మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్న ప్రస్తుత పరిస్థితిలో మేజర్ పంచాయతీలో ఇటువంటి సమస్యలు ఉండటంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి శ్మశాన వాటికకు మెరుగైన రహదారి సదుపాయంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేసి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

జాబ్‌మేళాలో 28 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. జెకెసి ఆధ్వర్యాన దివిస్ లేబొరేటరీ కంపెనీ నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 78 మంది పాల్గొనగా, వీరిలో 28 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, జెకెసి కో-ఆర్డినేటర్ వి.లూకేపాల్, కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి- లావేరు

జిల్లా అంధత్వ నివారణ సంస్థకు చెందిన ఆప్తాలమిక్ అధికారి జి.పద్మజ ఆధ్వర్యంలో బుడుమూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. స్క్రీన్‌టైమ్ తగ్గించుకోవాలని, ఆరుబయట ఆటలు ఎక్కువగా ఆడాలని ఆమె సూచించారు. కంటి ఆరోగ్యాన్ని పెంచే ఆకుకూరలు, బొప్పాయి వంటి వాటిని తింటూ శారీరక వ్యాయామం చేయాలన్నారు. ఐదుగురు విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో హెచ్ఎం రువ్వ పూర్ణచంద్రరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, సిహెచ్ఒ భారతి, ఎఎన్ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సిసితో క్రమశిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి

యువతరంలో దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం మూర్తీభవించేందుకు ఎన్‌సిసి శిక్షణ తప్పనిసరని 14 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శశాంక్ కుష్వహ అన్నారు. టెక్కలి దరి నౌపడ రైల్వే గేటు వద్ద ప్రణవి డిగ్రీ కళాశాలకు నూతనంగా మంజూరైన ఎన్‌సిసి యూనిట్‌లో అర్హులైన విద్యార్థులతో క్యాడెట్ల ఎంపిక గురువారం నిర్వహించారు. ఎంపికైన పురుష, మహిళా క్యాడట్లనుద్దేశించి మాట్లాడారు. ఆధునిక యుగంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధితో మనం పరుగులు తీయాలంటే క్రమశిక్షణ, అంకితభావం అవసరమన్నారు. ఎన్‌సిసి పూర్తిచేసిన క్యాడట్లకు డిఫెన్స్ అధికారులు కాక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఎన్‌సిసి శిక్షణ పొందిన విద్యార్థులు సమాజంలో ఆదర్శవంతులుగా గుర్తింపు పొందుతున్నారన్నారు. ఎన్‌సిసి 14 ఆంధ్రా బెటాలియన్ సుబేదర్ మేజర్ బల్వంత్ సింగ్, సుబేదార్ జితేంద్రకుమార్, సిహెచ్ఎం వి.శ్రీరామ్మూర్తి, రవికృష్ణ, జిసిఐ కె.త్రిషాలి క్యాడట్ల ఎంపిక పూర్తి చేశారు. ప్రణవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, కళాశాల ప్రిన్సిపాల్ నర్తు కృష్ణారావు, ఎన్‌సిసి శిక్షణాధికారి బి.మల్లేశ్వరరావు, కేర్ టేకర్ కొండల రుక్మంగధరరావు, ఎం.మంజుల, సీనియర్ అధ్యాపకులు రామపాత్రుని రామారావు, జి.కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో ఆటోకాడ్‌పై శిక్షణ

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో ఎపి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఆటోకాడ్ ద్వారా మెకానికల్ కాంపో నెంట్స్ డ్రాఫ్టింగ్ ఆఫ్‌లైన్ నైపుణ్య ఆధారిత శిక్షణ ఇస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. మెకానికల్ విభాగం ద్వితీయ సంవత్సరానికి చెందిన 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎపిఎస్ఎస్‌డిసి శిక్షకులు గౌతమ్ విద్యార్థులకు ఆటోకాడ్ సాఫ్ట్‌వేర్‌లో టు డి డ్రాయింగ్, లేయర్స్, ప్లాట్ కంట్రోల్స్, ఐసోమెట్రిక్ వీక్షణల రూపకల్పన వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీహరి, స్పాక్ డాక్టర్ బి.రామారావు, డిపార్ట్‌మెంట్ సమన్వయకర్త సాగర్ పాల్గొన్నారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు

అరసవల్లి: ఆహారాన్ని వృథా చేయవద్దని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డా.పైడి సింధూర అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యమహల్ దగ్గరలో గల రిక్షా కార్మికులకు, దినసరి కూలీలకు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అన్న వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని, జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ సహకారంతో నగరంలో పలుచోట్ల నిస్సహాయులకు ఆహారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ రైతులు ప్రపంచ జనాభా కంటే ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నారని, కొరత మాత్రం అలాగే కొనసాగుతోందని, చాలామంది ఆకలితో అలమటిస్తున్నారన్నారు. క్లబ్ ఉపాధ్యక్షులు బి.ఉమామహేశ్వర్, ఉర్లం శివతేజ, కార్యదర్శి టెక్కం రామ్ గోపాల్, సభ్యులు చౌదరి శ్రీనివాస్, మానవత సంస్థ పూర్వపు కార్యదర్శి టి.శ్రీనివాసరావు, రిక్షా కార్మిక యూనియన్ సభ్యుల బృందం పాల్గొన్నారు.



రిక్షా కార్మికులకు ఆహారాన్ని అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కీలక సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ మండల కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖాధికారి ధనుంజయ మజ్జికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు తక్షణమే ఐడిలు ఇచ్చి, వారి జీతాలు ఆలస్యం కాకుండా సకాలంలో చెల్లింపులు చేయాలని కోరారు. ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సెలవుల సమస్యకు పరిష్కారం చూపి ప్రత్యేక పరిస్థితుల్లో వారికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా అవసరమైన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు నియామకాలు చేసి బోధనలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కోరారు. విద్యావ్యవస్థ సజావుగా నడవాలంటే సమస్యలను సమయానుకూలంగా తీర్చాలని యూటీఎఫ్ నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్, జిల్లా సిపిఎస్ కో-కన్వీనర్ జానకిరావు, యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు కె.రామారావు, సూర్యం, సందీప్, శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

విశాఖలో టెక్ విప్లవం

నరసన్నపేట: ఇప్పటివరకు సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ నగరం త్వరలో ఎఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారనుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఎఐ సిటిగా మారితే, ఆంధ్రప్రదేశ్ దేశానికి డిజిటల్ ఇండియాలో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సాంకేతిక రంగం ఒక రాష్ట్ర భవిష్యత్‌ను ఎలా మార్చగలదో హైదరాబాద్ ముఖ్య ఉదాహరణ అని అన్నారు. దీంతో రాష్ట్ర ఆర్థిక రూపురేఖలు మారిపోతాయని అన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధిలో ఒక మైలురాయిగా మరనుందన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆర్థిక దూరదృష్టితో, పారదర్శక విధానాలతో వివిధ రాష్ట్రాలు, సింగపూర్, అమెరికా వంటి వివిధ దేశాల్లో పర్యటించి పెట్టుబడిదారులకు నమ్మకం కల్పిస్తున్నారని అన్నారు. స్థిరమైన విధానాలు, వేగవంతమైన అనుమతులు, మానవవనరులు అందుబాటులో ఉండడంతో రాష్ట్రానికి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని తెలిపారు. అనంతరం నాయకులు కార్యకర్తలతో కలిసి బాణసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బగ్గు అర్చన తదితరులు పాల్గొన్నారు.

22న బస్సు జాతా

ప్రజాశక్తి- పలాస

ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి నవంబరు 12 వరకు బస్సుజాతా నిర్వహిస్తున్నట్టు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్ చేశారు. దీనిని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన విద్యార్థుల బతుకులు దారుణంగా తయారైందన్నారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారని, 200 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఒక్క ప్రజాప్రతినిధి, అధికారులు స్పందించకపోవడం అత్యంత హేయమైన చర్యగా భావిస్తున్నా మన్నారు. ప్రభుత్వ వైద్యం, విద్యను పేదలకు అందజేయాల న్నారు. రాష్ట్రంలో మూతబడిన 4111 ప్రభుత్వ పాఠశాలలు తెరిపించాలన్నారు. యూనివర్సిటీల్లో నాన్ టీచింగ్ పోస్టులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ , ఇంజినీరింగ్, పిజి పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందక ఉద్యోగ ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగ సమస్యలు గాలికి వదిలేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహిస్తు న్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవికుమార్, ఉపాధ్యక్షులు కె.సాయి, పట్టణ నాయకులు సోమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యాన శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సత్యనారాయణ సిపిఆర్, ప్రథమ చికిత్సలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. గుండె ఆగినప్పుడు, ఊపిరితిత్తులు శ్వాసతీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు వ్యక్తికి సిపిఆర్ చేయడం ద్వారా ఎలా ప్రాణాన్ని కాపాడవచ్చో తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు, ఎముకలు విరిగినప్పుడు ట్రాయాంగిల్ బ్యాండెజ్ ద్వారా ఎలా కట్టు కట్టాలో తదితర ప్రథమ చికిత్స విధానాలు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, ఎంపిడిఒ రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎస్ఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో సంతబొమ్మాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుష్ వైద్యులు మోహనరావు గురువారం సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రజలకు, విద్యార్థులకు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా సిపిఆర్ పద్ధతిని చూపించారు. కార్యక్రమంలో రెడ్డి సూరిబాబు మాస్టర్, పిహెచ్‌సి సిబ్బంది శ్రీనివాసరావు, భాగ్యవతి, హైమావతి, చిన్నమ్మడు, గణేష్, ఉమ పాల్గొన్నారు.



సుమిత్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

సుమిత్‌కు ఘన సన్మానం

కవిటి: ముంబయిలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో దేశవ్యాప్తంగా పోటీగా వచ్చిన ఆలోచనల మధ్య క్లిష్ట సమస్యల పరిష్కారంలో తన ప్రతిభను చాటిచెప్పి ప్రకాశించిన రత్నాల సుమిత్ కుమార్‌ను ఆత్మీయంగా సత్కరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సొండి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం కొజ్జిరియా సంఘ భవనంలో సుమిత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులనూ సన్మానించారు. మారుమూల గ్రామం నుంచి మహారాష్ట్ర వేదికపై జాడుపూడి వాణి వినిపించిన సుమిత్ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని సభలో పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. సాంకేతిక రంగంలో సుమిత్ సాధించిన ఈ గుర్తింపు సమాజానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మొగిలిపురి సింహాచలపతి, ప్రధాన కార్యదర్శి రత్నాల వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు షావుకారి దివాకరరావు, రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, పాండవ చంద్రశేఖర్, మొగిలిపురి సీతాలు, రత్నాల వాసు, రత్నాల బలరాం, నల్ల సుందరరావు, నల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి- నందిగాం

ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొడ్డేపల్లి రామకృష్ణకు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ తరుపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ కె.కె.రామిరెడ్డి, జయపురం గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. శాఖల తరపున అభినందించారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో అనేక ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో విద్యావ్యాప్తి, వికాసానికి కృషి చేయడమే అతని ఉత్తమ ఉపాధ్యాయ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు


ఇచ్ఛాపురం: మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి పరిశీలకులు దుంపల లక్ష్మణరావు కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక గ్రామ దేవత ఆలయంలో వైసిపి నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలకు నిరసిస్తూ కోటి సంతకాలు సేకరణ చేపట్టామన్నారు. అందులో భాగంగానే మున్సిపాలిటీలో సంతకాల కార్యక్రమంపై పట్టణ ప్రజలకు వివరించారు. అలాగే పట్టణ కమిటీలు, అనుబంధ కమిటీల నియామకంపై చర్చించారు. చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, సంతు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



చలపతి మృతదేహం

టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని నర్సింగపల్లికి చెందిన చలపతి (50) మృతి చెందాడు. ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని రైల్వే గేటు నుంచి టెక్కలి రైల్వే స్టేషన్ మధ్యలో వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో పక్కనే ఉన్న పొదల్లోకి తుళ్లిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా, అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీను మృతదేహం

కవిటి: మండలంలోని జమేదారు పుట్టుగ సమీపంలో గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలానికి చెందిన యువకుడు దుర్మరణం చెందాడు. కవిటి ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు... టెక్కలి ఆదిఆంధ్ర వీధికి చెందిన వాడపల్లి శ్రీను (39) తన బావమరిది ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వైపు బయలుదేరాడు. ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో కవిటి మండలం జమేదారుపుట్టుగ వద్ద హైదరాబాద్-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బండి అదుపు తప్పి హైవే డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్రమైన గాయాలు కావడంతో తక్షణమే ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పలాస : పలాస రైల్వేస్టేషన్ పరిధి రెండో ప్లాట్‌ఫారం లైన్‌లో కొత్త రైల్వే వంతెన సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు పలాస జిఆర్‌పి ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు గురువారం తెలిపారు. మృతుడు వయసు సుమారు 45 ఏళ్ల ఉంటుందన్నారు. శరీరంపై నాచురంగు గల ఫాంట్, నీలం రంగుగల టీషర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440627567, 9492250069 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.



గుర్తింపుకార్డులతో విద్యార్థినులు

ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం

లావేరు: కౌమార దశలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై ఆడపిల్లలకు పరిపూర్ణ అవగాహన ఉండాలని స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణులు డాక్టర్ ప్రియాంక అన్నారు. తన తండ్రి, ప్రస్తుత తహశీల్దార్ నిడిగంట్ల వెంకటరావు చదువుకున్న లావేరు ఉన్నత పాఠశాలలో 275 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులను ఆమె వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు ప్రతినెల ఎదురయ్యే రుతు సంబంధమైన సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, పరిశుభ్రమైన శానిటరీ నాప్‌కిన్ల వినియోగం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని చెప్పారు. విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడిన ఆమె వారి సమస్యలకు నివారణ ఉపాయాలను కూడా అందించారు. విద్యార్థులకు గుర్తింపు కార్డులు వితరణ చేయడంతో పాటు విలువైన సలహాలు అందించినందుకు డాక్టర్ ప్రియాంకను హెచ్ఎం పసుపుల జగన్నాథం ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి నిడిగంట్ల త్రినాథరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిడిగంట్ల పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట కేసులో నెల రోజుల జైలుశిక్ష

శ్రీకాకుళం సిటీ: పేకాట కేసుకు సంబంధించిన ఆరుగురు వ్యక్తులకు నెల రోజులు జైలు శిక్ష, ఇద్దరికి రూ.3 వేలు జరిమానా కోర్టు విధించినట్లు 1వ పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ గురువారం చెప్పారు. మొండిట వీధిలో పేకాట ఆడుతూ పట్టుబడిన జూదరులు గుడ్ల సర్వాజి, పొట్నూరు సూర్యనారా యణ, వారణాసి సాయికుమార్, అందవరపు రవి కుమార్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చి నట్లు చెప్పారు. ఇదే కేసులో గుడ్ల శ్రీధర్, కోరాడ నాగ రాజులకు రూ. 3వేలు చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో

పట్టణంలో గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉమెన్స్ కాలేజ్ రోడ్డులో బహిరంగంగా వీరంగం, న్యూసెన్స్ చేసిన తంగివానిపేటకు చెందిన సాదు కృష్ణ అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకొని కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. నెలరోజులు సాధారణ జైలుశిక్ష న్యాయమూర్తి విధించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉద్యోగుల ధర్నా

శ్రీకాకుళం సిటీ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం ఎపిఇ పిడిసిఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సీపాన నరసింహామూర్తి ప్రకటనలో తెలిపారు. చర్చలకు తమ సంఘాన్ని ఆహ్వానించాలన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న విప్ అశోక్

అంగన్వాడీలు బాధ్యతగా పనిచేయాలి

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కంచిలి

చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సేవ చేసే అంగన్వాడీలు తమ తమ ఉద్యోగాన్ని బాధ్యతగా భావించి చేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కంచిలి మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం నిర్వహించిన పోషణ మాసోత్సవాలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులు, మహిళలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న అంగన్వాడీలు తమ ఉద్యోగాన్ని సేవగా బాధ్యతగా భావించి చేస్తున్నారని, తల్లి తరువాత తల్లిగా మారి సేవలందిస్తున్నారంటూ వారిని అభినందించారు. అంగన్వాడీలకు, హెల్పర్లకు తగిన గౌరవ వేతనం అందించి, వారి సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సామూహిక సీమంతాలు, పోషకాహార వారోత్సవాలు వంటి కార్యక్రమాల ద్వారా సేవలు అందిస్తున్నారన్నారు. అభివృద్ధిలో భాగస్వాములు కావడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్వాడీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది అశోక్‌ను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సిడిపిఒ కె.వసుంధరాదేవి, సూపర్‌వైజర్లు లక్ష్మి, ధనలక్ష్మి, ఈశ్వరి, నాగలక్ష్మి, సునీత, మంగమ్మ, నాగమణి, శాంతి, ఎంపిడిఒ వి.తిరుమలరావు పాల్గొన్నారు.


డ్రోన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఆధునికతను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

రైతులను అన్ని విధాలా ఆదుకునేవిధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని కుసుమపోలవలసకు చెందిన శ్రీరామ ఆంజనేయ కిసాన్ గ్రూప్ సభ్యులకు సబ్సిడీపై మంజూరు చేసిన డ్రోన్ యంత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.9.80 లక్షలు విలువైన డ్రోన్ యంత్రం కేవలం అతి తక్కువ ధరకే రైతులకు అందిస్తున్నామని తెలియజేశారు. రూ.7.84 లక్షలు రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి సంఘాన్ని ఏర్పాటు చేసుకోగలిగితే ఈ అవకాశం వారికి లభిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ, బోర అప్పలరాజు, తులసిపాటి కృష్ణంరాజు, భైరి అచ్చెన్నాయుడు, కూన రాంబాబు, వ్యవసాయ శాఖ ఎడి ఎల్.వి.మధు పాల్గొన్నారు.


థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సందడి చేస్తున్న నటులు

'మటన్ సూప్' సినీ బృందం సందడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని శ్రీదేవి థియేటర్‌లో ప్రదర్శించబడుతున్న మటన్ సూప్ నటీనటులు సనపల రామకృష్ణ, మేడసాని కిరణ్, నీరుడి గోవిందు రాజ్‌లు సందడి చేశారు. థియేటర్ ఆవరణలో కేక్‌కట్ చేసి ప్రేక్షకులకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండలంలోని చీమలవలసకు చెందిన మటన్ సూప్ నిర్మాత, నటుడు రామకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు, తన భార్య గీతారాణి ప్రోత్సాహంతో సినిమాను నిర్మించి విజయం సాధించినట్లు తెలిపారు. ఈ సినిమాలోని హర హర సాంగ్‌ను నటుడు తనికెళ్ళ భరణి రిలీజ్ చేశారని, జానపద గీతాన్ని నటుడు మురళీమోహన్, అలాగే టీజర్‌ను ప్రేమగా దర్శకుడు అనిల్ రావిపూడి చేతులమీదుగా రిలీజ్ చేయడం జరిగిందని తెలిపారు. చిన్న కుగ్రామం నుంచి సినీ ఇండస్ట్రీకి వెళ్లి సక్సెస్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త సనపల నారాయణరావు, పేడాడ చిన్నారావు, ప్రేక్షకులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

చీడపీడలపై అప్రమత్తం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఇళ్లయిపురం, సుందరాడ, కొసమాల, సిరియాకండి గ్రామాల్లో ఎఒ దానకర్ణుడుతో కలిసి సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.వెంకటరావు క్షేత్ర సందర్శించారు. రైతులకు పురుగు తెగుళ్లపై అవగాహన కల్పించారు. క్షేత్ర పరిశీలనలో వరిలో బ్యాక్టీరియల్ ఆకు ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు ప్లాంటామైసిన్ వంద గ్రాములు, కార్బన్డజిమ్ 200 గ్రాములు ఎకరాకి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికాచీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షణ్ముఖ, నిహారిక, క్రాంతి, సర్పంచ్ జనార్థన్, ఎల్లంనాయుడు, సిరిపురం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సామాన్యులకు జిఎస్‌టి ఊరట

ప్రజాశక్తి- పలాస

సామాన్యులకు అందుబాటులో అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జిఎస్‌టి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక మేథా స్కూల్ ఆవరణలో రోడ్డు రవాణాశాఖ ఆధ్వర్యాన జిఎస్‌టిపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అంతకముందు ర్యాలీని ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గించడం ద్వారా సామాన్యుల కొనుగోలు శక్తి పెరగిందన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గ జిఎస్‌టి ప్రత్యేక అధికారి మధుసూదనరావు, పలాస రవాణాశాఖ అధికారి కె.శ్రీనివాసరావు, జిఎస్‌టి అధికారులు రాము, మేథా పాఠశాల కరస్పాండెంట్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జిఎస్‌టి తగ్గింపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ... రవాణా శాఖ అధికారి గోవిందరాజు ఆధ్వర్యాన గురువారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ఆటో కార్మికులతో పట్టణ పుర వీధుల్లో భారీ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు, విడి భాగాలు కొనుగులులో తగ్గిన ధరలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పత్రీ తవిటయ్య, నందిగాం కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, లీలారాణి, నందికి జాని, కొండ శంకర్‌రెడ్డి, రెయ్య జానికిరామ్, దట్టి శ్రీను పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌పై టెక్కలి కారు స్టాండ్ ఆవరణలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి బి.సంజీవరావు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలపై జిఎస్‌టి 28 నుంచి 18 శాతానికి తగ్గిందని అన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి ఎఎంసి ఛైర్మన్ బగాది శేషగిరిరావు, గున్న వెంకటరమణ, డ్రైవర్లు పాల్గొన్నారు.


పలాస : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష



అరసవల్లి : నృత్యం చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న సాంప్రదాయ గిరిజన నృత్యాలు

అరసవల్లి: జిఎస్‌టి వారోత్సవాల సందర్భంగా ఎన్‌టిఆర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో గురువారం టెక్కలి ట్రైబల్ వెల్ఫేర్ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ బాలికలు చేసిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు అలరించాయి. నీరజ సుబ్రహ్మణ్యం శిష్య బృందం క్లాసికల్ డాన్స్, తప్పెటగుళ్ల ప్రదర్శనలు అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్‌తో ప్రజలు కొనుగోలు చేసిన అనంతరం కుటుంబ సమేతంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదిస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ వి.సుధీర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో గల విద్యుత్ సరఫరా లైన్లుకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో దల్లవలస, పిల్లలవలస, ధర్మపురం తదితర గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.


శంకుస్థాపన చేస్తున్న ప్రిన్సిపాల్ శరత్‌బాబు

సొంత నిధులతో కళాశాల అభివృద్ధి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో పలు అభివృద్ధి పనులకు ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. సొంత నిధులు వెచ్చించి కళాశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం పలువురు అభినందించారు. కళాశాల ప్రధాన ద్వారం, ప్రిన్సిపాల్ రూమ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్, కళాశాల ఎజిఎంఒ నల్లాన రమేష్, సీనియర్ అధ్యాపకులు బోరుభద్ర సురేష్‌కుమార్, పైడి సురేష్‌కుమార్, దువ్వు మమత పాల్గొన్నారు.


ఎన్నికైన ఆర్య వైశ్య యువజన సంఘ సభ్యులు

ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షునిగా చెన్నూరు గౌరీ దుర్గాజీ, సెక్రటరీ మాటూరు నవీన్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఉల్లి మహేంద్ర, మాటూరు స్వరూప్‌కుమార్, ట్రెజరర్ వల్లంపాటి కళ్యాణ్, వెచ్చ రాము. ఆలయ బాధ్యతలు కాళ్ల శ్రీనివాసరావు, కాదా వెంకటరమణలను ఎన్నుకున్నారు.

అన్నదానానికి రూ.లక్ష వితరణ

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి గురువారం నగరంలోని కొన్నవీధికి చెందిన పెంటయ్య, అన్నపూర్ణ దంపతులు స్వామి వారి అన్నదాన పథకానికి రూ.1,00,116 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షక అధికారి వెంకట రమణ, జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులు వారికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

వంద మందికి వైద్య పరీక్షలు

కొత్తూరు : మండలంలో నివగాంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇసిజి, డిసిహెచ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిటిసి బి.కృష్ణవేణి, సంజీవరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఐటిఐ కళాశాల నుంచి సూదికొండ రోడ్డు వరకు రూ. 23 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పదవి చేపట్టిన తర్వాత మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందించానని తెలిపారు. కాలువల్లో పూడికలు తీసేందుకు సుమారు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.పది కోట్లు మంజూరు చేయాలని మున్సిపల్ మంత్రి నారాయణకు కోరానని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా ప్రతి వార్డుకూ నిధులు మంజూరు చేసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, సైని వల్లభ, సవర రాంబాబు, ఎం.నరేంద్ర (చిన్ని), కొత్త సత్యం, కమిషనర్ ఎన్.రామారావు, డిఇ కనకరాజు, ఎఇ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

విధిగా స్టడీఅవర్స్ నిర్వహించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయునికి వారంలో 30 పీరియడ్లు ఉండేలా చూడాల్సిన బాధ్యత పాఠశాల హెచ్‌ఎంలదేనని జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తాడివలస, కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం పరిశీలించారు. పరీక్షల్లో విద్యార్థుల ప్రదర్శన ఆధారంగా విద్యార్థులకు గ్రేడ్లు నిర్ణయించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం స్టడీఅవర్స్ నిర్వహించాలని, స్టడీఅవర్స్‌కు హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం కంఠయ్యను ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న ఎస్‌ఎ-1 పరీక్షలను పరిశీలించారు. గ్రామస్తుల నుంచి, తల్లిదండ్రుల నుంచి, విద్యార్థుల నుంచి ఉపాధ్యాయులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో ఎండిఎం మెనూ అమలు బాధ్యత పాఠశాల సిబ్బందిదేనని చెప్పారు. అనంతరం పాఠశాలలో సమస్యలు, ఉపాధ్యాయుల తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో తమ సబ్జెక్టుల్లో పాఠాలు పూర్తిచేయాలని ఆదేశించారు. డిఇఒతో పాటు డిప్యూటీ డిఇఒ విజయకుమారి ఉన్నారు.

భారీ వాహనంతో వాహనాల మళ్లింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆమదాలవలస - పాలకొండ రహదారిపై గురువారం భారీ వాహనం ప్రయాణించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖపట్నం పోర్టు నుంచి ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ ప్రాంతానికి వెళ్తున్న ఈ భారీ వాహనంపై ఎత్తయిన యంత్ర పరికరాలు ఉండటంతో రహదారి పైభాగాన విద్యుత్ వైర్లు, చెట్లు, వంతెనలు వంటి ఇబ్బందులు తప్పించి మెల్లగా ప్రయాణం సాగించడంతో పట్టణంలోని ఫ్లై ఓవర్ దిగున ఒక్కసారిగా రద్దీ ఏర్పడి ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పాలకొండ వైపు వెళ్లే బస్సులు, వాహనాలు పట్టణంలోని ప్రధాన రహదారి గుండా వెళ్లి పార్వతీశంపేట మీదుగా తిమ్మాపురం వద్దకు చేరుకొని పాలకొండ వైపు బస్సులు వాహనాలు రాకపోకలు సాగించాయి. అలాగే పాలకొండ నుంచి వచ్చే వాహనాలు పార్వతీశం పేట మీదుగా పట్టణం గుండా ఫ్లైఓవర్‌కు చేరుకున్నాయి. ప్రయాణికులు, వాహనదారులు మాట్లాడుతూ ఇటువంటి భారీ వాహనాలు రాత్రిపూట వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే ఇబ్బందులకు గురికాక తప్పదన్నారు.


నిలిచిన వాహనాలు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ఆహార భద్రత అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దేశంలో ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత అవసరమని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో గురువారం ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆహార దినోత్సవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి గురించి ప్రపంచ వ్యాప్తంగా చర్చించడం, దాని నిర్మూలన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించే చర్యలను ప్రోత్సహించడం కీలకమన్నారు. ఆహార భద్రత, పోషకాహార ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరచడంతో పాటు ఆహార వృథాను అరికట్టడంపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఆర్థిక శాస్త్ర విభాగ అధిపతి టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ జనాభాకు తగ్గ ఆహార ఉత్పత్తి కీలకమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చిన్నారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ కె.మౌనిక పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అర్హులైన ఎస్‌సి సామాజక వర్గానికి చెందిన కుటుంబాలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వహణ అధికారి గెడ్డెమ్మ అన్నారు. పట్టణంలోని ఎస్‌సి కార్పొరేషన్ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక ప్రగతి సాధ్యమన్నారు. ప్రధానంగా ప్రభుత్వం అందజేస్తున్న విద్య, ఆర్థిక ప్రగతికి అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్క కుటుంబం ఆర్థిక ప్రగతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ లలితకుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గడ్డెమ్మ

రాష్ట్రస్థాయి పోటీలకు ఝాన్సీ ఎంపిక


ఝాన్సీ

పలాస : రాష్ట్రస్థాయి పోటీలకు రాపాక ఝాన్సీ ఎంపికైందని పిడి పద్మలోచన తెలిపారు. బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అభినందించారు. అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్, హైజంప్, 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానాల్లో నిలచి 14 ఏళ్ల బాలబాలికల అథ్లెటిక్స్ జిల్లా సెలక్షన్లలో అర్హత సాధించిందన్నారు. వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. గోవిందపురం జడ్‌పిహెచ్‌ఎస్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటుందన్నారు. ఇంతకుముందు అండర్-14 విభాగంలో జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌సిప్, గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో అథ్లెటిక్స్ 60 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్ మూడు ఈవెంట్లో విజేతగా నిలిచి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుందన్నారు. ఝాన్సీ ఎంపికపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


మాట్లాడుతున్న ఎడిఇ నిరంజన్

విద్యుత్‌శాఖ అధికారుల పర్యటన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని బూర్జపాడు పంచాయతీ డొంకూరులో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. దీనిపై ఇటీవల జనసేన నాయకులు చీకటి కృష్ణయ్య విజయవాడ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు గ్రామానికి వెళ్లి వాస్తవ పరిస్థితి తెలుసుకొని గ్రామస్తులతో మాట్లాడారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎడిఇ ఎం.నిరంజన్, ఎఇ గోవిందరావు, లైన్‌మెన్ రామచంద్ర, జనసేన నాయకులు దున్న లోకనాథం, చీకటి చిన్నారావు, బడే వెంకటేష్, మాకుపల్లి లింగరాజు, దాసరి తాతారావు పాల్గొన్నారు.



మలుపుల్లో పొదల తొలగింపు

ప్రజాశక్తి- పొందూరు

నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన చిలకపాలెం - పొందూరు అంతర్రాష్ట్ర రహదారిలో ప్రమాదకర మలుపుల వద్ద పెరిగిన పొదలను గురువారం స్థానిక ఎస్‌ఐ వి. సత్యనారాయణ పర్యవేక్షణలో తొలగించారు. మలుపుల వద్ద పెరిగిన పొదలు కారణంగా ఎదురెదురు వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై స్థానికులు అధికారులకు, గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఈ రోడ్డులో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో జెసిబి సాయంతో మలుపుల వద్ద దట్టంగా పెరిగిన పొదలతో పాటు ప్రమాదకరంగా మారిన చెట్టుకొమ్మలను తొలగించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

సరుబుజ్జిలి: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నం చేయడం దారుణమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస, కొండవలస, పాలవలస గ్రామాల్లో రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో వైసిపి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, గుజ్జల మోహనరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నగదును అందిస్తున్న కలాం ఫౌండేషన్ సభ్యులు

కలాం ఫౌండేషన్ ఉదారత

కవిటి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొత్తపుట్టుగకు చెందిన నర్తు శివాజీకి అండగా నిలిచి అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఉదారత చాటుకుంది. నేతాజీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అవడంతో కిడ్నీ వ్యాధి చికిత్స నిమిత్తం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు బుధవారం నేతాజీకి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు, యువత పాల్గొన్నారు.

'సంకల్పం'పై అవగాహన

మందస : మండలం అంబుగాం ఉన్నత పాఠశాలలో మందస సిఐ ఎం.తిరుపతిరావు సంకల్పం కార్యక్రమంపై గురువారం కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మత్తు బారిన పడి జీవితాలను పాడుచేసుకోవద్దని అన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవరించవద్దని అన్నారు. మీ తల్లితండులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ తిరుపతిరావు